సాక్షి
కర్నూలు
బుధవారం, 9, ఆగస్టు, 2023



శ్రీశైలంలో శాస్త్రోక్తంగా పూజలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల ఆలయ ప్రాంగణం లోని శనగల బసవన్నకు, బయలువీరభద్ర స్వామి వారికి మంగళవారం శాస్త్రోక్తంగా ఈఓ లవన్న, అర్చకులు విశేషపూజలు నిర్వహించారు.



సాగుకు సాంకేతిక దన్ను

వ్యవసాయం మరింత లాభసాటిగా మారేలా ప్రభుత్వం మల్చింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తోంది. 50 శాతం రాయితీ ఇస్తుండటంతో రైతులు ఈ పద్ధతిలో పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. - 8లో..



కనుల పండువగా..

మహానంది: కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లకు భౌమ సప్తమి సందర్భంగా కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ చంద్రశేఖర్‌రెడి తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

వృద్ధులు, దివ్యాంగ ఓటర్లను గుర్తించండి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ జి.సృజన

కర్నూలు(సెంట్రల్): నడవలేని స్థితిలోని వృద్ధులు, దివ్యాంగ ఓటర్లను ప్రత్యేకంగా గుర్తించాలని, వీరికి వచ్చే ఎన్నికల్లో ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తోందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ జి.సృజన అధికారులకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో ఓటరు జాబితా సవరణపై ఎలక్టోరల్ ఆఫీసర్(ఈఆర్‌ఓలు), అసిస్టెంట్ ఎలక్టోరల్ ఆఫీసర్(ఏఈఆర్‌ఓ)లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించాలన్నారు. అలాగే 18 ఏళ్లు నిండిన ట్రాన్స్‌జెండర్లు, సెక్స్ వర్కర్లు, ఇళ్లులేని వారిని కూడా గుర్తించి ఓటు హక్కు కల్పించాలన్నారు. జిల్లా నుంచి వెళ్లిపోయిన, మరణించిన వారి వివరాలను సేకరించి తగిన ఆధారాలతో తొలగించాలన్నారు. మరణించిన వారి ఓటు తొలగించేందుకు మరణ ధ్రువీకరణ పత్రాన్ని కచ్చితంగా నమోదు చేయాలన్నారు. ఒకే ఇంటిలో ఉన్న ఓటర్లను ఒకే పోలింగ్ బూత్‌లో ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు ఏజెంట్లను నియమించుకొని ఓటరు జాబితా సవరణలో భాగస్వామ్యం అయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జేసీ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, డీఆర్వో ఎస్వీ నాగేశ్వరరావు, కర్నూలు ఆర్డీఓ హరిప్రసాదు పాల్గొన్నారు.

నేటి నుంచి విద్యుత్ ఉద్యోగుల సమ్మె బాట

కర్నూలు(రాజ్‌విహార్): తమసమస్యలు పరిష్కరించాలని విద్యుత్ ఉద్యోగులు గత కొద్ది రోజులుగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిపై యాజమాన్యం స్పందించడం లేదని బుధవారం తమ అధికారిక సెల్ సిమ్ కార్డులు వెనక్కి ఇచ్చేసి, అర్ధరాత్రి నుంచి సమ్మె బాట పట్టాలని నిర్ణయించుకున్నట్లు విద్యుత్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గణేష్ తెలిపారు.

ఈ శ్రామ్ కార్డులు పొందండి

కర్నూలు(రాజ్‌విహార్):అసంఘటిత కార్మికులు ఈ శ్రామ్ కార్డులకు దరఖాస్తు చేసుకొని పొందాలని కార్మిక శాఖ అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కేశన్న మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమీపంలోని సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో వీటిని పొందవచ్చని వెల్లడించారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ): అనుమతి లేకుండా ఎవరైనా అక్రమంగా మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. ఓర్వకల్లు మండలం బొద్దువారిపల్లె వద్ద సర్వే నంబర్ 433లో ఉన్న భూమిలో గుంటూరు జిల్లాకు చెందిన శ్రీనివాసరెడ్డి ఎలాంటి లైసెన్స్, అనుమతి లేకుండా స్టీటైట్ ఖనిజం, తెల్ల సున్నం రాయి, మట్టి తీసుకెళ్తున్నారనే సమాచారంతో విజిలెన్స్ అడిషనల్ డైరెక్టర్ బైరాగా నాయుడు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ అహ్మద్ తనిఖీ చేశారు. అక్రమ తవ్వకాల ద్వారా ప్రభుత్వ ఆదాయానికి ఎంత మేర నష్టం జరిగిందని అంచనా వేసి శ్రీనివాసరెడ్డిపై కేసు నమోదు చేసి జరిమానా విధిస్తామని డిప్యూటీ డైరెక్టర్ తెలిపారు.

రేపు ఆదోని, ఆలూరు అభివృద్ధిపై సమీక్ష

కర్నూలు (సెంట్రల్) : ఆదోని, ఆలూరు నియోజకవర్గాల అభివృద్ధిపై ఆదోని మున్సిపల్ కార్యాలయంలో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ డాక్టర్ సృజన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమీక్షకు అన్ని శాఖల జిల్లా ఉన్నతాధికారులతో పాటు అజెండా రూపకల్పన అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. ఆయా నియోజకవర్గాల ప్రజాప్రతినిధులు కూడా సమావేశానికి హాజరవుతున్నట్లు కలెక్టర్ వెల్లడించారు.

నేడు, రేపు జిల్లాలో ఫుడ్ కమిషన్ చైర్మన్ పర్యటన

కర్నూలు (సెంట్రల్) : రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి బుధ, గురువారాల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు డీఎస్‌ఓ ఆచార్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. బుధవారం ఆదోని డివిజన్‌లో, గురువారం కర్నూలు డివిజన్‌లో రేషన్ షాపులు, ఆహార భద్రతకు సంబంధించిన సంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేస్తారని ఆయన వెల్లడించారు. కాగా మంగళవారం సాయంత్రానికే ఫుడ్ కమిషన్ చైర్మన్ కర్నూలుకు చేరుకున్నారు.

నీటిని సద్వినియోగం చేసుకుందాం

- పోతిరెడ్డిపాడు నుంచి నీటి విడుదలకు ప్రజాప్రతిధుల పట్టు
- పది రోజులు గడువు కోరిన అధికారులు
- చివరకు 15 వేల క్యూసెక్కుల తక్షణ విడుదలకు ఏకాభిప్రాయం
- ఫలవంతంగా ముగిసిన నీటి పారుదల సలహా మండలి సమావేశం
- ప్రాజెక్టుల మరమ్మతులకు నిధుల కొరత లేదన్న ఆర్థిక మంత్రి బుగ్గన



సాగునీటి సలహా మండలి సమావేశంలో మాట్లాడుతున్న ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, చిత్రంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రి గుమ్మనూరు జయరాం, కలెక్టర్ మనజీర్ జిలానీ, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు

నంద్యాల(సెంట్రల్): 'ఆలస్యం వద్దు.. ప్రస్తుతం రిజర్వాయర్లలో ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుతామని ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రతినిధులు స్పష్టం చేశారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు వైఎస్సార్ జిల్లా రైతాంగానికి సాగునీటి విడుదలకు కీలకమైన నీటి పారుదల సలహా మండలి సమావేశం మంగళవారం నంద్యాల కలెక్టరేట్‌లో నిర్వహించారు. నంద్యాల జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ శామూన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రాజెక్టుల నుంచి నీటి విడుదల సాధ్యాసాధ్యాలపై విస్తృతంగా చర్చ సాగింది. సమావేశానికి డిప్యూటీ సీఎం అంజాద్‌బాషా, ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాంతో పాటు ఉమ్మడి జిల్లాల ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరయ్యారు. ముందుగా ఉమ్మడి జిల్లా భౌగోళిక, సాగునీటి ప్రాజెక్టులపై చిత్రాల ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎస్సార్బీసీ, తెలుగుగంగ, కేసీ కాలువ, హెచ్చెల్సీ, ఎల్లెల్సీ పరిధిలోని కాలువలకు నీటి విడుదలపై ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ప్రజాప్రతినిధులు తమ డిమాండ్లను ప్రస్తావించారు. ఈ సందర్భంగా కర్నూలు జలవనరుల పర్యవేక్షక ఇంజనీరు రెడ్డి శేఖరరెడ్డి తుంగభద్ర, కృష్ణా నదుల్లో నీటి ప్రవాహాల స్థితి గతులను వివరించారు. శ్రీశైలం జలాశయంలో ప్రస్తుతం ఉన్న 863 అడుగుల నీటి మట్టంతో నీటి విడుదల తక్షణమే సాధ్యం కాదని వివరించారు. ఆల్మట్టిలో ఇన్‌ఫ్లో ఆశాజనకంగా లేకపోవటంతో జాప్యం జరుగుతోందని, ఒక విడత వర్షాలు పడితేనే పరిస్థితిలో మార్పు వస్తుందనన్నారు. వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లో 10 టీఎంసీల నిల్వ ఉన్నప్పుడే సిద్దాపురం ఎత్తిపోతలకు నీటిని నింపవచ్చని నంద్యాల జలవనరుల శాఖ ఎస్‌ఈ వెంకట రమణ పేర్కొన్నారు. వెంటనే శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి జోక్యం చేసుకుంటూ...ఇప్పటికే బండిఆత్మకూరు, మహానంది ప్రాంతాల్లో వరి నారుమళ్లు సిద్ధం అయ్యాయని, ఇంకా సమయం కావాలని కోరడం అర్ధరహితమన్నారు. 'ఓ వైపు తెలంగాణ రాష్ట్ర అధికారులు కల్వకుర్తి ఎత్తిపోతలతో పాటు, ఎడమగట్టు విద్యుత్ కేంద్రం ద్వారా భారీగా నీటిని వినియోగించుకుంటుంటే మనం ఆలస్యం చేయటం సరికాదు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఇంజినీరు అధికారులు ప్రస్తుతం పోతిరెడ్డిపాడు నుంచి 15 వేల క్యూసెక్కుల తక్షణ విడుదలకు ఆస్కారం ఉందని వివరించడంతో ఇందుకు ప్రజాప్రతినిధులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు.



హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

మంత్రి బుగ్గన ఆగ్రహం..

శివభాష్యం సాగర్ ప్రాజెక్టు కింద తక్షణమే నీటిని విడుదల చేయాలని మంత్రులు ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా హంద్రీనీవా కార్యనిర్వాహక ఇంజినీరు రాంభూపాల్ ఎత్తిపోతల మోటార్ల మరమ్మతులపై వివరాలు వెల్లడిస్తుండగా.. ఆర్థిక మంత్రి బుగ్గన జోక్యం చేసుకుని కెపాసిటర్లను రీప్లేస్ చేశారా అని ప్రశ్నించారు. దీంతో ఈఈ సమాధానమిస్తూ కెపాసిటర్ల విషయంపై తడబడ్డారు. మంత్రి కలగజేసుకుని కనీసం కెపాసిటర్ అంటే ఏంటో తెలియకుండానే పనిచేస్తున్నారా? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్, ఎమ్మెల్సీలు ఇసాక్‌బాషా, రామచంద్రారెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, కర్నూలు కలెక్టర్ డాక్టర్ సృజన, మార్క్‌ఫెడ్ రాష్ట్ర చైర్మన్ పీపీ నాగిరెడ్డి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వంగాల భరత్ కుమార్ రెడ్డి, వైఎస్సార్ జిల్లా సలహా మండలి చైర్మన్ ప్రసాద్ రెడ్డి, డీఆర్వో పుల్లయ్య, తెలుగుగంగ ఎస్‌ఈ వెంకటరమణ, ఏపీ ఇరిగేషన్ డెవలప్‌మెంట్ చైర్మన్ గిరిజ, మున్సిపల్ చైర్మన్ మాబున్నిసా పాల్గొన్నారు.

అధికారులు నిర్లక్ష్యం వీడాలి



గోరుకల్లు జలాశయం మట్టి కట్ట మరమ్మతుల విషయంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రివిట్‌మెంట్ పనుల్ని త్వరితగతిన పూర్తి చేయాలి. ఎస్సార్‌బీసీకి కేటాయించిన నీటిని తక్షణం విడుదల చేయటంతో పాటు ముచ్చుమర్రి ద్వారా కేసీకి నీటిని అందించి గడివేముల, పాణ్యం రైతాంగాన్ని ఆదుకోవాలి. 20 ఏళ్లుగా సాగు నీటిని వాడుకోకుండా ఆయకట్టు రైతులుగా నమోదై సంక్షేమ పథకాలకు దూరమైన కల్లూరు మండలం సల్కాపురం, గోకులపాడు, మార్కాపురం రైతుల్ని ఆయకట్టు రైతులుగా డీలోకలైజ్ చేయడమో, నీటిని అందించడమో చేసి ఆదుకోవాలి.

– కాటసాని రాంభూపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే, పాణ్యం

ఉన్నంతలో విడుదల చేయండి



ఇప్పటికే నీటి విడుదల ఆలస్యమైంది. ఇంకా పదిరోజుల సమయం తీసుకుంటే రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. పోతిరెడ్డిపాడు నుంచి సాధ్యమైనంత నీటిని తక్షణమే విడుదల చేసి వెలుగోడు, సిద్ధాపురం ఎత్తిపోతల ప్రాజెక్టుల్ని నింపి నాట్లకు ఇబ్బంది లేకుండా చూడాలి. సిద్ధాపురం ఎత్తిపోతలకు సంబంధించి అండర్‌గ్రౌండ్ విద్యుత్ మరమ్మతులు తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. ఆర్థిక మంత్రి చొరవ తీసుకుని పరిష్కరించాలి. మద్దిలేరు వాగుపై భీమవరం వద్ద వంతెన నిర్మించి 400 ఎకరాల పరిధిలోని అన్నదాతలకు ఉపశమనం కలిగించాలి.

– శిల్పా చక్రపాణిరెడ్డి, ఎమ్మెల్యే, శ్రీశైలం

అలగనూరును పూర్తి చేయాలి



కేసీ ఆయకట్టుకు గుండెకాయలాంటి అలగనూరు జలాశయం పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలి. మల్యాల, ముచ్చుమర్రి ఎత్తిపోతలతో కేసీకి నీటిని విడుదల చేయాలి. ఇస్కాల చెరువుతో పాటు నియోజకవర్గంలో ఇటీవల దెబ్బతిన్న చెరువుల మరమ్మతుల్ని త్వరితగతిన పూర్తి చేయాలి.

– తొగురు ఆర్థర్, ఎమ్మెల్యే, నందికొట్కూరు

సకాలంలో నీరిచ్చి తీరుతాం

సమావేశంలో ఎక్కువ మంది ప్రజాప్రతినిధులు పోతిరెడ్డిపాడు నుంచి సాధ్యమైన మేరకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీనిపై ప్రభుత్వానికి సమావేశపు మినిట్స్‌ను పంపి అనుమతి తీసుకుంటాం. రైతాంగానికి సకాలంలో నీరిచ్చి తీరుతాం.

– బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, ఆర్థిక మంత్రి

ఏబీసీకి నీరు విడుదల చేయాలి

పశ్చిమ ప్రాంత రైతుల ఉప కాలువలకు నీటిని అందించాలి. ఆలూరు బ్రాంచ్ కాలువ (ఏబీసీ)కు హంద్రీనీవా జలాల విడుదలపై చర్యలు తీసుకోవాలి. దెబ్బతిన్న చెరువుల మరమ్మతులను వేగవంతంగా పూర్తి చేయాలి.

–గుమ్మనూరు జయరాం, కార్మికశాఖ మంత్రి

ప్రభుత్వ అనుమతి కోరతాం

సమావేశంలో పలువురు వ్యక్తం చేసిన అభిప్రాయాల్ని నోట్ చేసుకున్నాం. వివరాలను ప్రభుత్వానికి పంపి నీటి విడుదలకు అనుమతి కోరతాం. నీటి విడుదలపై అంచనా వేసుకుని రైతులకు సమాచారమివ్వాలని జిల్లా వ్యవసాయాధికారిని ఆదేశించాం. కుందూ కాలుష్యంపై జిల్లా అధికారులతో కమిటీ వేసి, పలు యాజమాన్యాలకు షోకాజ్ నోటీసులు ఇచ్చాం.

– మనజీర్ జిలానీ శామూన్, జిల్లా కలెక్టర్, నంద్యాల

కుందూ రైతులను ఆదుకోవాలి

అలగనూరు జలాశయం ఖాళీగా ఉండటంతో పోతిరెడ్డిపాడు నీటిపైనే కుందూ ఆయకట్టు ఆధారపడి ఉంది. వీలైనంత త్వరగా వరద జలాలను విడుదల చేసి కుందూ ప్రాంత రైతుల తాగు, సాగునీటి సమస్యను పరిష్కరించాలి.

– పోచా బ్రహ్మానందరెడ్డి, ఎంపీ, నంద్యాల

అరకొర నీటితో సమస్యే

పోతిరెడ్డిపాడు నుంచి పూర్తిస్థాయిలో నీటి విడుదల చేస్తేనే మా ప్రాంతానికి నీరు చేరుతోంది. అరకొరగా విడుదలయ్యే నీరు పైప్రాంత రైతులే వినియోగించుకుంటే మా పరిస్థితేంటి? రుద్రవరం పెద్ద చెరువు, చింతల చెరువు మరమ్మతుల విషయంలో చిన్ననీటి పారుదల అధికారులు యుద్ధప్రాతిపదికన స్పందించాలి.

– గంగుల బిజేంద్రారెడ్డి, ఎమ్మెల్యే, ఆళ్లగడ్డ

పేదింటికి పెళ్లి కానుక

- ఎస్సీ, ఎస్టీ, బీసీ, ముస్లిం మైనార్టీ కుటుంబాలకు ప్రభుత్వం అండ
- వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీతోఫా కింద ఆర్థిక సాయం
- ఈ ఏడాది మే 5 తర్వాత వివాహం చేసుకున్న వారికి అమలు
- ఉమ్మడి కర్నూలు జిల్లాలో 2,058 మందికి అర్హత
- నేడు బ్యాంక్ ఖాతాల్లో నగదు జమ చేయనున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి



కర్నూలు(అగ్రికల్చర్): ఇల్లు కట్టి చూడు... పెళ్లి చేసి చూడు అన్నారు పెద్దలు. రెండింటిలో ఏది చేసినా జేబు ఖాళీ అవుతుంది. పేదలకు వివాహం మోయలేని ఆర్థిక భారం. ఇలాంటి వారికి అండగా నిలబడేందుకు ప్రభుత్వం వైఎస్ఆర్ కల్యాణమస్తు, షాదీ తోఫా పథకాలను ప్రవేశపెట్టింది. బాల్య వివాహాలను నివారించి, పిల్లల చదువును ప్రోత్సహించేడమే లక్ష్యంగా ప్రవేశపెట్టిన ఈ పథకాల కింద ఆర్థిక సహాయం అందజేసేందుకు రంగం సిద్ధమైంది. నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి, వివాహమైన పేదింటి అమ్మాయిల బ్యాంక్ ఖాతాల్లో ఆర్థిక సాయాన్ని జమ చేయనున్నారు. ఈ ఏడాదిలో మే 5వ తేది నుంచి వివాహాలు చేసుకున్న యువతులకు కల్యాణమస్తు, షాదీ తోఫా వర్తిస్తుంది. ఈ పథకాల కింద అనకాపల్లి, శ్రీకాకుళం, విజయనగరం తర్వాత కర్నూలు, నంద్యాల జిల్లాకు చెందిన మహిళలకే ఎక్కువ ప్రయోజనం చేకూరుతుండటం విశేషం. కల్యాణమస్తు, షాదీతోఫా అమలును జిల్లా స్థాయిలో డీఆర్‌డీఏ–వైకేపీ నిర్వహిస్తోంది. ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులు విడుదల చేసే కార్యక్రమాన్ని కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్‌లో వీక్షించనున్నారు. అమ్మాయిలతో ముఖ్యమంత్రి ముఖాముఖిగా మాట్లాడే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో 2,058 మంది

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మే నెల 5 తర్వాత వివాహమైన ముస్లిం మైనార్టీలు, బడుగు, బలహీన వర్గాలు, దివ్యాంగుల కుటుంబాలకు చెందిన అమ్మాయిలు 2,058 మంది ఉన్నారు. ఇందులో కర్నూలు జిల్లాలో 1,076 మంది ఉండగా వీరి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా రూ.8,61,05,000, నంద్యాల జిల్లాలో 982 మంది ఉండగా రూ.8,35,95,000 జమ కానుంది.

ఆర్థిక లబ్ధి ఇలా

కల్యాణమస్తు కింద ఎస్సీ, ఎస్టీలకు రూ.లక్ష, అదే ఆయా కులాల అమ్మాయిలు ఇతర కులాల వారిని వివాహం చేసుకుంటే రూ.1.20 లక్షలు, బీసీ అమ్మాయిలకు రూ.50,000, బీసీ అమ్మాయిలు ఇతర కులాల వారిని వివాహం చేసుకుంటే రూ.75వేలు, ముస్లిం మైనార్టీ అమ్మాయిలకు షాదీతోఫా కింద రూ.లక్ష, దివ్యాంగుల అమ్మాయిలకు రూ.1.50 లక్ష, భవన నిర్మాణ కార్మికులకు రూ.40 వేల ప్రకారం ప్రభుత్వం ఆర్థిక సహాయం అందజేస్తోంది.


అర్హతలు ఇలా...

అర్బన్‌లో ఏడాదికి రూ.1.20 లక్షలు, గ్రామీణ ప్రాంతాల్లో రూ.లక్షలోపు ఆదాయం కలిగి ఉన్న వారే కల్యాణమస్తు, షాదీతోఫా పథకాలకు అర్హులవుతారు. ఆదాయపు పన్ను చెల్లిస్తున్న వారు, 1000 చదరపు అడుగులపైన ఇళ్లు కలిగిన వారు, ఫోర్ వీలర్ కలిగిన వారు, 300 యూనిట్ల కంటే ఎక్కువ విద్యుత్ వినియోగిస్తున్న వారు,10 ఎకరాలకుపైబడి భూమి ఉన్న వారు అనర్హులవుతారు. అమ్మాయికి 18 ఏళ్లు, అబ్బాయికి 21 ఏళ్లు నిండి ఉండాలి. ఇరువురు కనీసం 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.

జిల్లాలో విడతల వారీగా లబ్ధిదారులు..పొందిన సాయం

విడత	లబ్ధిదారులు	పొందిన ఆర్థిక సహాయం
1వ విడత	271	2,31,40,000
2వ విడత	574	4,26,35,000
3వ విడత	1,076	8,61,05,000
మొత్తం	1,921	15,18,80,000

పారదర్శకంగా కల్యాణ మస్తు, షాదీ తోఫా అర్హుల ఎంపిక



కల్యాణమస్తు, షాదీతోఫా కింద అర్హులైన అమ్మాయిల ఎంపిక 100 శాతం పారదర్శకంగా జరిగింది. కర్నూలు జిల్లాలో 1076 మంది అమ్మాయిలకు అర్హత లభించింది. వీరి బ్యాంకు ఖాతాలకు డీబీటీ ద్వారా రూ. 8,61,05,000 నగదు జమ చేయడానికి రంగం సిద్ధం చేశాము. ముఖ్యమంత్రి బటన్ నొక్కి నిధులు విడుదల చేయనున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి షాదీతోఫా పొందే ముస్లిం అమ్మాయితో ముఖాముఖి మాట్లాడే అవకాశం ఉంది.

– నాగశివలీల, పీడీ, డీఆర్‌డీఏ–వైకేపీ, కర్నూలు

నేటి నుంచి ఆజాదీకా అమృత్ మహోత్సవాలు

- ఈనెల 15 వరకు ప్రత్యేక కార్యక్రమాలు
- ప్రతి గ్రామ పంచాయతీలో 75 మొక్కలు నాటేందుకు ఏర్పాటు
- ఈ నెల 13, 14 తేదీల్లో ఇంటింటికి జాతీయ పతాకం



కర్నూలు(అగ్రికల్చర్): మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ నెల 9 నుంచి ఆజాదీకా అమృత్ మహోత్సవాన్ని పెద్ద ఎత్తున నిర్వహించనున్నారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తి అయిన సందర్భంగా జిల్లాలోని 484 గ్రామ పంచాయతీల్లో నా భూమి–నా దేశం, నేల తల్లికి నమస్కారం–వీరులకు వందనం వంటి ప్రత్యేక కార్యక్రమాలు చేయనున్నారు. ప్రతి గ్రామ పంచాయతీలో జిల్లా నీటియాజమాన్య సంస్థ 75 మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యతలను కూడా చేపడుతుంది. జిల్లా మొత్తంగా 36,300 మొక్కలు నాటడానికి ఏర్పాట్లు చేశారు. అలాగే ప్రత్యేక కార్యక్రమాల్లో భాగంగా శిలాఫలకం ఆవిష్కరణ, పంచప్రాణ్ ప్రతిజ్ఞ, వసుధకు వందనం, వీరులకు వందనం కార్యక్రమాలు నిర్వహించాల్సి ఉంది. ఇందుకు సంబంధించి విధి విధానాలను గ్రామీణాభివృద్ధి శాఖ ఖరారు చేసింది. శిలాఫలకాలను గ్రామ పంచాయతీల్లోని పాఠశాలల్లో ఆవిష్కరించనున్నారు. వాటిలో ఆజాదీకా అమృత్ మహోత్సవ లోగో, ప్రధానమంత్రి సూక్తి, స్థానిక వీరుల పేర్లు, గ్రామ పంచాయతీ పేరు వివరాలు ఉంటాయని జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ అమరనాథరెడ్డి తెలిపారు. 13, 14 తేదీల్లో ఇంటింటికి జాతీయ పతాకం చేరుస్తారు. శిలాఫలకం ఆవిష్కరించిన చోటనే ఈనెల 15న జాతీయ పతాకాన్ని ఆవిష్కరించనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

మరింత పకడ్బందీగా ఈ క్రాప్ నమోదు

- వీసీలో వ్యవసాయ శాఖ కమిషనర్

కర్నూలు(అగ్రికల్చర్): 2023 ఖరీఫ్ సీజన్‌లో సాగు చేసిన పంటల నమోదును మరింత పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయ శాఖ కమిషనర్ హరికిరణ్ ఆదేశించారు. మంగళవారం గుంటూరు నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివిధ ప్రాధాన్యత అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... వెంటనే ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను ప్రారంభించి సెప్టెంబరు 15లోగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. యాప్ డౌన్‌లోడ్ చేసుకోవడం, ఆర్‌బీకేలకు శిక్షణ ఇవ్వడం తదితర వాటిని ఒకటి, రెండు రోజుల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. సెప్టెంబరు 15 నుంచి 30లోపు సోషల్ ఆడిట్, సూపర్ చెక్, ఈ–కేవైసీ చేయించడం తదితరవాటిని చేపట్టాలని పేర్కొన్నారు. సాగుదారులకు సీసీఆర్‌సీ కార్డులు ఈ నెల 10వ తేదీ వరకు జారీ చేయాలని పేర్కొన్నారు. సీసీఆర్‌సీ కార్డులు పొందిన రైతులకు బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించాలన్నారు. ఆర్‌బీకేల ద్వారా ఎరువులు పంపిణీని ముమ్మరం చేయాలన్నారు. కర్నూలు నుంచి జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి మాట్లాడుతూ... 20–20–0–13 కాంప్లెక్స్ ఎరువును ప్రైవేటు డీలర్లు రూ.1140 నుంచి రూ.1150 ధరతో విక్రయిస్తున్నారని, ఆర్‌బీకేల్లో రూ.1190 ఉందని, ఈ వ్యత్యాసాన్ని తగ్గించాలని కమిషనర్‌ను కోరారు. వీసీలో ఏడీఏలు సాలురెడ్డి, మహ్మమద్‌ఖాద్రీ, గిరీష్,ఏవోలు రాఘవేంద్ర, శారదమ్మ, ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

తొలి విడతలో 679 డిగ్రీ సీట్లు భర్తీ

- క్లస్టర్ వర్సిటీ పరిధిలో మూడు డిగ్రీ కాలేజీలు
- మొత్తం 1,408 డిగ్రీ సీట్లు

కర్నూలు సిటీ: క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలో తొలి విడతలో 48.23 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఈ వర్సిటీ పరిధిలో ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీ(డాక్టర్స్ కాలనీ), కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీ, సిల్వర్‌జూబ్లీ డిగ్రీ కాలేజీలు ఉన్నాయి. వీటిలో ఉండే వివిధ కోర్సుల్లో మొత్తం 1408 డిగ్రీ సీట్లు ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నత విద్యా సంస్థల్లో డిగ్రీ సీట్లను ఆన్‌లైన్‌లో చేసుకున్న దరఖాస్తుల ఆధారంగా సీట్లను భర్తీ చేస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి సీట్లను ఈ నెల 4వ తేదీన మొదటి విడత కింద ఏపీ ఉన్నత విద్యా మండలి కేటాయించింది. సీట్లు పొందిన విద్యార్థులు ఈ నెల 7వ తేదీలోపు ఆయా కాలేజీల్లో ప్రవేశం పొందారు. జిల్లాలోని క్లస్టర్ వర్సిటీ పరిధిలోని కాలేజీల్లో తొలివిడతగా 679 సీట్లు భర్తీ అయినట్లు అధికారులు తెలిపారు.

సిల్వర్‌జూబ్లీలో ప్రత్యేక సెట్ ద్వారా సీట్ల భర్తీ

ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పటి నుంచి సిల్వర్‌జూబ్లీ కాలేజీలో ఏపీ రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీ ప్రవేశ పరీక్ష ద్వారా సీట్లు భర్తీ చేసే వారు. రాష్ట్ర విభజన తరువాత కూడా ఉమ్మడిగానే ప్రవేశ పరీక్ష నిర్వహించారు. తాజాగా క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోకి ఈ కాలేజీ చేరడంతో ఈ ఏడాది మొదటిసారిగా సిల్వర్‌సెట్ అని ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహించి సీట్లను భర్తీ చేస్తున్నారు. ఈ కాలేజీలో వివిధ అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సుల్లో మొత్తం 280 సీట్లు ఉన్నాయి. ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన వారితో 249 సీట్లను రెండు విడతల్లో భర్తీ చేశారు. ప్రస్తుతం కెమిస్ట్రీ, ఫిజిక్స్ మెయిన్ సబ్జెక్టులుగా ఉండే సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయి. ఈ సీట్లను కూడా సిల్వర్‌సెట్ ప్రవేశ పరీక్షలో అర్హత పొందిన వారికే కేటాయించనున్నట్లు ఆ కాలేజీ వర్గాలు వెల్లడించాయి.

కేవీఆర్‌లో 385 సీట్లు భర్తీ

కేవీఆర్ మహిళా డిగ్రీ కాలేజీలో అండర్ గ్రాడ్యుయేషన్ కోర్సులు మొత్తం 21 ఉన్నాయి. ఈ కోర్సుల్లో 538 సీట్లు ఉన్నాయి. ఏపీ ఉన్నత విద్యా మండలి కేటాయించిన మొదటి విడత సీట్లతో 385 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందారు.

పురుషుల డిగ్రీ కాలేజీ...

క్లస్టర్ యూనివర్సిటీ పరిధిలోని ప్రభుత్వ పురుషుల డిగ్రీ కాలేజీలో మొత్తం 590 సీట్లు ఉన్నాయి. ఈ కాలేజీలో మొదటి విడతలో 145 సీట్లు భర్తీ అయ్యాయి. ఇందులో అత్యధికంగా బీకామ్ కంప్యూటర్ అప్లికేషన్ కోర్సు సీట్లు భర్తీ అయినట్లు కాలేజీ వర్గాలు తెలిపాయి. ఆయా కాలేజీల్లో సీట్లు పొందిన విద్యార్థులకు ఈ నెల 10 నుంచి తరగతులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలుస్తోంది.



క్లుప్తంగా

దళితులపై దాడులను సహించం

● ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్



వలగొండలో మాట్లాడుతున్న రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్

ఆస్పరి:దళితులపై ఎవరైనా దాడులు చేస్తే సహించేది లేదని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ విక్టర్ ప్రసాద్ అన్నారు. మండలంలోని వలగొండ గ్రామంలో మొహర్రం పండుగ సందర్భంగా జరిగిన ఘర్షణలో బీసీ వర్గానికి చెందిన కొందరు ఎస్సీ కాలనీపై దాడులు చేసి దళితులను గాయపరిచారు. ఈ నేపథ్యంలో చైర్మన్ ఆ గ్రామాన్ని సందర్శించి గాయపడిన దళిత కుటుంబాలను పరామర్శించారు. అండగా ఉంటామని బాధితులకు ధైర్యం చెప్పారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో చైర్మన్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమానత్వంతో బతకాలన్నారు. ఏవైనా సమస్యలుంటే పెద్దల సమక్షంలో పరిష్కరించుకోవాలన్నారు. గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసి ఇరు వర్గాలు వారు భవిష్యత్‌లో ఘర్షణ పడకుండా పీస్ కమిటీని ఏర్పాటు చేయాలని పత్తికొండ డీఎస్పీ శ్రీనివాసరెడ్డికి సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కుమారస్వామి, ఎంఆర్‌పీఎస్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ బొందిమడుగుల రమేష్, ఏపీ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సువర్ణ రాజు, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

కర్నూలు:కర్నూలు నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని చల్లా వారి వీధిలో భారీగా పేకాట సాగుతున్నట్లు సమాచారం అందడంతో సీఐ శంకరయ్య ఆదేశాల మేరకు పోలీసులు జూద కేంద్రంపై దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి రూ.11,300 నగదును సీజ్ చేశారు. పేకాటరాయుళ్లపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు.

సాగుకు సాంకేతిక దన్ను

● ఏటేటా పెరుగుతున్న మల్చింగ్ సాగు విస్తీర్ణం
● 30 శాతం పైగా అధిక దిగుబడులకు అవకాశం
● 50 రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం





బేతంచెర్ల సమీపంలో పండ్లతోటలో మల్చింగ్ విధానంలో పెరిగిన పూల మొక్కలు, చాగలమర్రి సమీపంలో మిరప నాటేందుకు వేసిన మల్చింగ్

ఆళ్లగడ్డ: రైతులు స్థానిక వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ.. తక్కువ పెట్టుబడితో చక్కటి లాభాలు గడించేలా రాష్ట్ర ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తోంది. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల ద్వారా సేవలను ఇంటి ముంగిటకు చేర్చగా అదే క్రమంలో వ్యవసాయానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని మరింత జోడిస్తోంది. భూమిలో తేమను కాపాడుతూ.. చీడ పీడలకు చెక్ పెడుతూ పెట్టుబడి వ్యయాన్ని తగ్గించడమే లక్ష్యంగా మల్చింగ్ విధానాన్ని ప్రోత్సహిస్తోంది. జిల్లాలో ఇటీవల మల్చింగ్ సాగు విస్తీర్ణం భారీగా పెరుగుతోంది. ప్రభుతం కూడా ఉద్యానశాఖ ఆధ్వర్యంలో మల్చింగ్ పద్ధతికి 50 శాతం రాయితీ ఇస్తూ ప్రోత్సహిస్తుండటంతో రైతులు దీనిపై మక్కువ చూపిస్తున్నారు. ఈ ఏడాది సుమారు 2500 ఎకరాల్లో మల్చింగ్, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలతో సేద్యం చేసేలా అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. పంటల రక్షిత సాగులో భాగమే ఈ మల్చింగ్ విధానం. వార్షిక, ద్వివార్షిక పంటలు, కూరగాయలు, తీగ జాతి ఉద్యాన పంటలు, బహుళ వార్షిక పంటలైన పండ్ల తోటలకు పాలీ పిల్మిలను (పాలిథిన్ షీట్‌లు) భూమి కప్పి పంటసాగు చేసే విధానాన్ని మల్చింగ్ అంటారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో మల్చింగ్ విధానం పలు రకాల పంటలకు ఎంతో ఉపయోగం. ప్రభుత్వం దీన్ని ఆచరణలో పెట్టడం వల్ల బహుళ ప్రయోజనాలు చేకూరుతున్నాయి. కూరగాయలు, పండ్లు, తీగజాతి తోటలు తదితర ఉద్యాన పంటల్లో దీన్ని అమలు చేసేలా ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో అనేక ప్రాంతాల్లో రైతులు మల్చింగ్ విధానాన్ని అనుసరించడంపై ఆసక్తి చూపిస్తున్నారు.

ప్రయోజనాలు ఇలా..

ఈ విధానంతో భూమిలో తేమను సంరక్షిస్తోంది. భూమి, మొక్క నుంచి తేమ ఆవిరి కాకుండా ఉంటుంది. నేలలో ఉష్ణోగ్రతను క్రమబద్ధీకరించి మొక్కకు తగిన సూక్ష్మ వాతావరణాన్ని కల్పిస్తోంది. కలుపును పూర్తిగా నివారించవచ్చు. భూమిలో ఉండే చీడపీడలకు కారణమైన బ్యాక్టీరియా శిలీంధ్రాలు పూర్తిగా నాశనమవుతాయి. భూమిలో వేసిన ఎరువు గాలిలో ఆవిరి కాకుండా వంద శాతం మొక్కలకు అందుతుంది. భూమిలో సేంద్రియ పదార్థం పెరుగుతుంది. పైభాగంలో ఉండే సిల్వర్ కలర్ పాలీ ఫిల్మ్ వాడకం వల్ల క్రిమికీటకాలు దరిచేరవు. ఫలితంగా పెట్టుబడి ఖర్చులు 40 శాతం ఆదా అవుతుంది. అధిక దిగుబడులతో పాటు నాణ్యత పెరుగుతుంది. ఒక్కో ఫాలీ ఫిల్మ్‌ను రెండు పంటలకు వినియోగించుకోవచ్చు. వార్షిక పంట (కూరగాయలు, మిరప)లకు 20 - 25 మైక్రాన్ల మందం, ద్వివార్షిక పంట (వంగ, దొండ తదితర) 40 - 45 మైక్రాన్ల మందం, బహు వార్షిక పంటలైన పండ్ల తోటలకు 50 - 100 మైక్రాన్ల మందం కలిగిన ఫిల్మ్ అవసరం

ప్రభుత్వ రాయితీ ఇలా..

మల్చింగ్ విధానంలో పంటల సాగుకు ఉద్యానశాఖ ఆధ్వర్యంలో సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం ద్వార (ఎంఐడీహెచ్) రాయితీ ఇస్తోంది. రైతులు ఉద్యానశాఖ అధికారులు సూచించిన విధంగా పాలీ పిల్మ్‌లను కొనుగోలు చేసి పంటకు వినియోగించుకుంటే హెక్టార్‌కు యూనిట్ విలువ రూ. 32 వేలుగా నిర్ణయించారు. ఇందులో ప్రభుత్వం 50 శాతం అంటే రూ. 16 వేల వరకు రాయితీ ఇస్తుంది. రైతులు ముందుగా తాము సాగు చేయబోయే పంట వివరాలు, అవసరమైన ధ్రువీకరణ పత్రాల జిరాక్స్‌లు ఉద్యానశాఖ అధికారులకు సమర్పించాలి. రైతులు వేసుకున్న పాలీ ఫిల్మ్‌లు, పంటను పరిశీలన చేసిన తరువాత రాయితీ సొమ్ములు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుంది.

ఈ పద్ధతితో నీరు ఆదా



నాకున్న నాలుగు ఎకరాల్లో మల్చింగ్ విధానంలో డ్రాగన్ ఫ్రూట్ సాగు చేశా. సాధారణంగా నాలుగు ఎకరాలకు నీటి తడులు పారించాలంటే బోరులో కనీసం 3 ఇంచ్‌ల నీరు వస్తే కాని సరిపోదు. మా బోరులో 1.5 ఇంచుల నీరే వస్తోంది. ఆ నిరే వారానికి ఒక గంట వదిలితే సరిపోతోంది. సాధారణ పద్ధతిలో సాగుతో పోలిస్తే ఈ పద్ధతిలో నీటిని ఆదా చేసుకోవచ్చు. – ఆంజనేయులు – రైతు, శాంతినగరం

పెట్టుబడి తగ్గుతుంది



ఐదు ఎకరాల్లో మల్చింగ్ విధానంతో నన్నారి సాగు చేశాను. గతంలో 10 రోజులకు ఒకసారి కలుపు తీయడానికి వందలాది మంది కూలీలు అవసరమయ్యేవారు. మల్చింగ్ సాగుతో ఇద్దరు, ముగ్గురు కూలీలైతే కలుపు తీసేస్తున్నారు. ఎరువులు, మందుల వేసే ఖర్చు కూడా లేక పోవడంతో ఐదు ఎకరాలపై కనీసం రూ 2 లక్షల వరకు వ్యయభారం తగ్గింది. – రామగురివిరెడ్డి, రైతు, చిన్నవంగళి

మల్చింగ్ సాగు విస్తరణకు చర్యలు



మల్చింగ్ విధానం సాగును రైతులు ఇప్పుడిప్పుడే అవలంభిస్తున్నారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలతో రైతుల్లో ఆసక్తి పెరిగింది. ఈ పద్ధతిలో సాగు చేసిన రైతులు 30 శాతం పైగా అధిక దిగుబడులు సాధిస్తున్నారు. 40 శాతం పెట్టుబడి ఖర్చులు తగ్గించుకుంటున్నారు. జిల్లాలో ఈ ఏడాది 1,250 ఎకరాల్లో మల్చింగ్ విధానంతో సాగు చేపట్టేలా టార్గెట్ పెట్టుకున్నాం. హెక్టార్‌కు రూ.16 వేల సబ్సిడీ అందజేస్తాం. క్షేత్రస్థాయిలో రైతుల్లో అవగాహన కల్పించడానికి ప్రత్యేక కృషి చేస్తున్నాం. – నాగేశ్వరరావు, జిల్లా ఉద్యాన వన శాఖ అధికారి

భార్యపై అనుమానంతో వ్యక్తి ఆత్మహత్య

బనగానపల్లె రూరల్: నందివర్గం పోలీసు స్టేషన్ పరిధిలోని రామకృష్ణాపురం గ్రామానికి చెందిన చల్లా కావేరి జయరాముడు(48) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ రామాంజనేయరెడ్డి తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన చల్లా కావేరి జయరాముడు, మహేశ్వరి దంపతులు వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. అయితే మహేశ్వరి రెండేళ్లుగా గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో చనువుగా ఉంటోందని అనుమానించి తీవ్రంగా మనస్తాపం చెందాడు. ఈ క్రమంలో మంగళవారం గ్రామంలో ఉన్న వాటర్ ప్లాంట్ వెనుక వైపు ఉన్న చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందినట్లు ఎస్ఐ రామాంజనేయ రెడ్డి తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపు తప్పి మహిళ మృతి



మృతి చెందిన లింగాల అమ్మని

నంజాపుల: కోవెలకుంట్ల – జమ్ములమడుగు ప్రధాన రహదారిలో అక్కంపల్లె సమీపంలో మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ దుర్మరణం చెందింది. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు.. వైఎస్సార్ జిల్లా జమ్ములమడుగు మండలం దేవగుడి గ్రామానికి చెందిన లింగాల అమ్మని(43)కి అనారోగ్యంగా ఉంది. నంద్యాల జిల్లా దొర్నిపాడు మండలం ఉమాపతి నగర్‌లో ఆకు పసురు వైద్యం కోసం తన కుమారుడు దివ్యకుమార్‌తో బైక్‌పై బయలుదేరారు. మార్గమధ్యలో అక్కంపల్లె గ్రామ సమీపంలో అకస్మాత్తుగా రోడ్డు పైకి పశువులు అడ్డు వచ్చాయి. ఈ క్రమంలో బైక్ అదుపుతప్పి కింద పడటంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వెనుక మరో బైక్‌లో వస్తున్న అమ్మని చిన్న కుమారుడు భరత్ గమనించి ఇద్దరిని జమ్ములమడుగు ప్రభుత్వ ఆసుపత్రి తీసుకెళ్లాడు. అక్కడ చికిత్స పొందుతూ అమ్మని మృతి చెందింది. భరత్ ఫిర్యాదు మేరకు కేసు నమెదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

గొలుసు దొంగల చేతివాటం

కర్నూలు: కర్నూలులోని గాయత్రి ఎస్టేట్‌లో గొలుసు దొంగలు చేతివాటం ప్రదర్శించారు. విఠల్ నగర్‌లో నివాసముంటున్న శ్రీదేవి సోమవారం రాత్రి గాయత్రి ఎస్టేట్ మీదుగా ఇంటికి నడుచుకుంటూ వెళ్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు ద్విచక్ర వాహనంపై ఆమెను సమీపించి మెడలో ఉన్న రెండు తులాల బంగారు గొలుసును లాక్కుని ఉడాయించారు. ఆమె తేరుకుని దొంగ.. దొంగ.. అని అరిచేలోగా కనిపించకుండా పక్క సందులో నుంచి పారిపోయారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకుని దొంగల కోసం గాలిస్తున్నారు.

యువకుడిపై లైంగిక వేధింపుల కేసు నమోదు...

దేవనకొండ మండలం పుటకలమర్రి గ్రామానికి చెందిన మల్లికార్జునపై మూడవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో లైంగిక వేధింపుల కేసు నమోదయ్యింది. చదువుకునే సమయంలో పరిచయమున్న ఓ యువతి ప్రస్తుతం కర్నూలులో హాస్టల్‌లో ఉంటూ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. కొంత కాలంగా మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురిచేస్తున్నట్లు యువతి ఫిర్యాదు చేయడంతో మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సమయ పాలన పాటించాలి

కర్నూలు (టౌన్) : ఆసుపత్రిలో పనిచేసే వైద్యులు, వైద్య అధ్యాపకులు సమయ పాలన పాటించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్. వి.వెంకటరంగారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో వైద్యులు, పలు విభాగాల వైద్య అధ్యాపకులతో సమావేశమై మాట్లాడారు. ప్రతిరోజు ఓపీ, ఐపీ విభాగాల్లో వైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. త్వరలో ఆసుపత్రిలో నిరంతర తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంఓలు, డాక్టర్లు ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, హేమానళిని, హరిశ్చరణ్, శివనాయక్, రాధారాణి, శ్రీరాములు, వెంకటరమణ పాల్గొన్నారు.

పుస్తకాలు ఎవరివి?



కొండ ప్రాంతాల్లో పడేసిన పుస్తకాలను పరిశీలిస్తున్న ఎస్ఐ రామిరెడ్డి

బనగానపల్లె: మీరాపురం – యాగంటి కొండ ల మధ్య మీరాపురానికి సుమారు ఐదు కిలో మీటర్ల దూరంలో 1వ తరగతికి చెందిన నోటు పుస్తకాలు, ప్రభుత్వ పాఠ్య పుస్తకాలు, బెల్టు, పలక, బలపాలు, ప్లేట్ లభ్యమయ్యాయి. పుస్తకాలపై కేవలం జీ స్వాతి పేరు మాత్రమే ఉంది. సమాచారం అందుకున్న ఎస్ఐ రామిరెడ్డి మంగళవారం సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. చుట్టుపక్కల గాలించినా ఎటువంటి ఆచూకీ లభించలేదు. కొండ ప్రాంతంలో వీటిని పడేయడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పుస్తకాలు ఎవరివి, ఇక్కడికి ఎలా వచ్చాయి తదితర వివరాలను సేకరిస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు



స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడిన మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం

కర్నూలు: మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని ట్రాఫిక్ డీఎస్పీ నాగభూషణం హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాలను వివరించడానికి ట్రాఫిక్ డీఎస్పీ ఆధ్వర్యంలో నగరంలోని రాజ్‌విహార్, సి.క్యాంప్ సెంటర్, ఓల్డ్ ఈద్గా, ఫైవ్ రోడ్ జంక్షన్ ప్రాంతాల్లో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. లైసెన్స్ లేకుండా ద్విచక్ర వాహనాలపై త్రిబుల్ రైడింగ్ వెళ్తున్న 21 మంది మైనర్లను అదుపులోకి తీసుకుని వారి వాహనాలను స్వాధీనం చేసుకుని కొత్తపేటలోని ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాఫిక్ ఉల్లంఘనల కింద కేసు నమోదు చేసి రూ.42,735 జరిమానా విధించి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. వాహనదారులు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, లైసెన్స్ లేకుండా వాహనం నడపరాదని, త్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్, రాంగ్‌రూట్ డ్రైవింగ్ వంటి వాటికి పాల్పడకూడదని హెచ్చరించారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడినవారి గురించి ఉదాహరణలు వివరిస్తూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచమని సూచించారు.

ఏడుగురు గంజాయి విక్రేతల అరెస్టు

● 28 కేజీల గంజాయి, 25 గ్రాముల మత్తు పదార్థం సీజ్



స్వాధీనం చేసుకున్న గంజాయి, మత్తు పదార్థం

కర్నూలు: కర్నూలు నగర శివారులో గంజాయి విక్రయిస్తున్న, సేవిస్తున్న వ్యక్తులను కర్నూలు అర్బన్ తాలూకా పోలీసులు అరెస్టు చేసి కటకటాలకు పంపారు. పక్కా సమాచారం మేరకు అర్బన్ తాలూకా సీఐ శ్రీరాం, ఎస్ఐలు షమీర్ బాషా, బాలనరసింహులు, రామయ్య, మన్మథ విజయ్ తమ సిబ్బందితో జగన్నాథగట్టు ప్రాంతంలో మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఏడుగురు గంజాయి సరఫరాదారులను అదుపులోకి తీసుకున్నారు. సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన రోహిత్, మునగాలపాడు గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ లోకేష్, కర్నూలుకు చెందిన తెలుగు చిన్న, కల్లూరు పట్టణానికి చెందిన సి.నరసింహులు, పంచలింగాలకు చెందిన మీనిగ నరేందర్, ప్రకాశం జిల్లా బొమ్మలాపురం గ్రామానికి చెందిన లక్ష్మీ నారాయణ, డి.ప్రభుదాసు తదితరులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి 25 కేజీల గంజాయి, 25 గ్రాముల ఎండీఎంఏ మత్తు పదార్థాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ప్రధాన నిందితుడు రోహిత్..

సత్యసాయి జిల్లా హిందూపురం పట్టణానికి చెందిన ఎ.రోహిత్ కర్నూలులో ఉంటూ అతని స్నేహితుడైన బ్రో అలియాస్ మనోహర్ ద్వారా ఈ దందా నిర్వహిస్తున్నట్లు పోలీసు విచారణలో బయటపడింది. తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తులంతా రోహిత్‌కు సహాయకులుగా ఉంటున్నట్లు గుర్తించారు. బ్రో అలియాస్ మనోహర్‌ను టూటౌన్ పోలీసులు ఇటీవల అరెస్టు చేసి జైలుకు పంపారు. ఇదిలాఉంటే మత్తుకు అలవాటు పడి గంజాయి సేవిస్తున్న మరో 24 మందిని కూడా అరెస్టు చేసి వారి వద్ద నుంచి రెండు కేజీల 780 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా భారీ మొత్తంలో గంజాయిని సీజ్ చేసినందుకు క్రైం పార్టీ సిబ్బందిని సీఐ అభినందించారు. మరింత లోతుగా విచారణ జరిపేందుకు అరెస్టు అయిన ముద్దాయిలను కోర్టు అనుమతితో పోలీసు కస్టడీకి తీసుకోనున్నట్లు సీఐ తెలిపారు.

పుస్తకాలను ప్రేమిద్దాం !

● పుస్తక పఠనంతో విజ్ఞాన వికాసం
● ప్రతి ఒక్కరు అలవాటు చేసుకోవలంటున్న మేధావులు
● నేడు పుస్తక ప్రేమికుల దినోత్సవం

కర్నూలు కల్చరల్: చిరిగిన చొక్కా అయినా తొడుక్కో కానీ ఒక మంచి పుస్తకం కొనుక్కో అని ఓ రచయిత అన్న మాట అక్షరసత్యం. ఎందుకంటే ఓ మంచి పుస్తకం వందమంది స్నేహితులతో సమానం. అలాంటి పుస్తక పఠనం వల్ల విజ్ఞానం పెరుగుతుంది. లోకజ్ఞానం తెలుస్తుంది. అందుకే కొందరు పుస్తక ప్రియులు మార్కెట్‌లోకి కొత్త పుస్తకం వచ్చిందంటే చాలు తీసుకుని తమ గ్రంథాలయంలో ఉంచుకుంటారు. ఆర్థిక స్తోమత లేని వారు ఏ గ్రంథాలయంలోనో స్నేహితుల వద్దో సంపాదించి చదువుతారు. పుస్తకాలతో గొప్ప అనుబంధాన్ని పెంచుకున్న పాఠకుల కోసం ప్రతి సంవత్సరం ఆగస్టు 9న 'పుస్తక ప్రేమికుల దినోత్సవం' నిర్వహిస్తారు. నేడు ఈ దినోత్సవం సందర్భంగా పుస్తక పఠనం, వాటి ఉపయోగాలు గురించి తెలుసుకుందాం.

నేటి ఆధునిక సాంకేతి పరిజ్ఞానం పరుగుల్లో పుస్తక పఠనం బాగా తగ్గిపోయింది. ఇది సమాజంపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. పుస్తక పఠనం పెంచేలా చర్యలు చేపట్టాలని మేధావులు అభిప్రాయ పడుతున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వంవిరివిగా గ్రంథాలయాలను నెలకొల్పుతోంది. ప్రతి పల్లెకు వాటిని విస్తరించి పుస్తక పఠనం ఆవశ్యకతను తెలియజేస్తోంది.

పుస్తకపఠనంతో కలిగే ప్రయోజనాల్లో కొన్ని..

- పుస్తక అధ్యయనం విజ్ఞానాన్ని,వికాసాన్ని పెంచుతాయి.
- ఒత్తిడి తగ్గించి మానసిక ఆరోగ్యాన్ని కలిగిస్తుంది.
- పుస్తకాలు మంచి మిత్రుల్లాంటివి. పలు సమస్యలకు పరిష్కారాలను చూపుతాయి.
- జీవితంలో అపజయాలను చవిచూసినప్పుడు పుస్తకాలు ధైర్యాన్ని ఇస్తాయి. విజయాలకు మార్గదర్శకమవుతాయి.
- వివిధ భాషలపై పట్టును పెంచుతాయి.
- సమాజంపై అవగాహన కలిగిస్తాయి.
- మనలోని భావాలకు అక్షర రూపం ఇచ్చి కవులుగా, రచయితలుగా, సాహితీవేత్తలుగా ఎదగడానికి దోహదపడతాయి.



గ్రంథాలయంలో పుస్తకం పఠనం చేస్తున్న దృశ్యం

ఉమ్మడి జిల్లాలో గ్రంథాలయాలు

జిల్లాలో కేంద్ర గ్రంథాలయం ఒకటి, 58 గ్రంథాలయ శాఖలు, ఒకటి గ్రామీణ గ్రంథాలయం ఉంది. 159 పుస్తక సంక్షిప్త కేంద్రాలు ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథాలయంతో పాటు ఇతర గ్రంథాలయాల్లో 6,50,4000 పుస్తకాలున్నాయి. కేంద్ర గ్రంథాలయంలో 9500 మంది, మిగతా వాటిల్లో 67,100 మంది శాశ్వత సభ్యులు ఉన్నారు. కేంద్ర గ్రంథాలయంలో ప్రతి రోజు సుమారు 400 మంది పఠనం చేస్తుంటారు. శాశ్వత సభ్యత్వం ఉన్నవారు పుస్తకాలను ఇళ్లకు తీసుకెళ్తూ పఠనాసక్తిని కొనసాగిస్తున్నారు.

పుస్తకం ఉన్నతంగా తీర్చి దిద్దుతుంది



కాలగమనానికి పుస్తకాలే పునాది రాళ్లు. నిన్నటి చరిత్ర నుంచి రేపటి చరిత్రకు పుస్తకాలే ఊపిరి. కలం లేని, కాగితం లేని, మేథస్సు లేని విధంగా సమాజం సాగుతోంది. ఈ స్థితి మారాలంటే పునరుజ్జీవం పొందాలంటే పుస్తకాలను పట్టాల్సిందే. అధ్యయనం చేయాల్సిందే. సెల్ ఒకటి చేతిలో ఉంటే చాలు సర్వ విజ్ఞానం చేతిలో ఉన్నట్లే అనుకునే నేటి తరం సంపూర్ణ జ్ఞాన వంతులు కాలేక పోతున్నారు. సాంకేతిక మోజులో సవ్యమైన పుస్తక పఠనాన్ని జారవిడిస్తే మానవ జాతి మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. –దండబోయిన పార్వతీ దేవి, తెలుగు అధ్యాపకురాలు, కేవీఆర్ కాలేజీ

అందుబాటులో అవసరమైన పుస్తకాలు



అన్ని గ్రంథాలయ శాఖల్లో అన్ని వయసుల వారికి అవసరమైన పుస్తకాలు లక్షల్లో అందుబాటులో ఉన్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలకు బాల్యం నుంచే పుస్తక పఠనం అలవాటు చేయాలి. ఉపాధ్యాయులు కూడా ఆ దిశగా విద్యార్థులను సిద్ధం చేయాలి. పాఠ్యాంశాలకు సంబంధించినవే కాకుండా విజ్ఞానాభివృద్ధికి ఉపయోగపడే పుస్తకాలు చదివేలా ప్రోత్సహించాలి. పుస్తక పఠనంపై ఆసక్తి పెంపొందించేందుకు మేము తరచుగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – ప్రకాష్, కార్యదర్శి, జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ, కర్నూలు